మనస్తత్వాలు:

# వింత పరివర్తన

యం. యస్, చలం

సీతారామయ్య భార్య వాణ్ణి ప్రేమించటం లేదంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఆవిడే కాదు ఏ ఆవిడదీ వాణ్ణి ప్రేమించలేదు. వాడిలో ఏముంది గనక ప్రేమించటానికి! ఏమీ లేదనేదే వున్నదని ప్రేమించటానికి యిది కలియుగ మాయె!

అందమైనవాడా అంటే—సన్నగా పొడుగ్గా ముసలివాడిలా వాలిపోయి లోతుకు పోయిన కళ్ళలో గుంటలుపడ్డ దవళ్ళలో వికృతంగా వుంటాడు. డబ్బుకలవాడా అంటే అదీ లేదు. ఇక తెలివి తేటలా తన మామూలు గుమాస్తాగిరికి కావాల్సినవాటికంటే ఎక్కువేమీ లేవు. మాట్లాడుతుంటే ముక్కుతో మాట్లాడుతున్నట్టు అసహ్యంగా వుంటుంది.

అలా అని వాడి భార్య యింకెవరినన్నా ప్రేమిస్తోందనడానికి వీలులేదు. యీ విషయంలో మట్టుకు ఆవిడ కృతయుగంనాటి మనిషి.

“ఏమో—మనస్సులో ఎవరినన్నా ప్రేమిస్తో వుండకూడదా?” అని ఎవరైనా అడ్డు ప్రశ్న లేయటం సబబైనపనికాదు. మనస్సుకు సంబంధించిన విషయాలను బాహ్యవిషయాలతో ముడి పెట్టటం దేనికి?

సీతారామయ్య సరసంగా భార్య పైటచెంగు పట్టుకోబోయి చీవాట్లు తినేవాడు. ఇంకొంచెం స్వతంత్రించాడా, “ఏమిటా సరసం” అంటూ కసిరివేసేది. ఆ కసుర్లు యిరుగుపొరుక్కి ఎక్కడ వినిపిస్తాయో అని భయపడి పిల్లిలా ఆవిడ వంక చూశేవాడు.

అద్దంలో ముఖం చూసుకున్నప్పుడల్లా సీతారామయ్యకు తనెంత వికృతంగా వున్నదీ తెలుస్తూండేది. బహుశా తన అంద వికారం ఎలా వుందో తెలుసుకోవాలనే అద్దం చూసుకునేవాడేమో!

వాడి అందానికి వాడే అసహ్యించుకునేవాడు. తనుపుట్టగానే తనతల్లి తనను చంపేయని నేరానికి ఆవిణ్ణికూడా తిట్టుకునేవాడు. ఇలాంటి సమయాల్లో వాడికి తోటి గుమాస్తా 'శ్రీనివాసం' జ్ఞప్తికి వచ్చి ఛాలా బాధపెట్టేవాడు.

నిజానికి శ్రీనివాసం ఎంత అందమైనవాడు. బజారునపోతోంటే ఎదురుగావచ్చే ప్రతి ఆడదీ తలెత్తి వాడి వంక చూడవలసిందే! వాడెంత అదృష్టవంతుడనుకునేవాడు. పోనీ తనకలాంటి అందం లేకపోయినా ప్రపంచంలో మొట్టమొదటి కురూపిగానైనా భగవంతుడు పుట్టించి వుంటే, తన్నొక వింతమనిషిగానైనా స్త్రీలు చూసివుందురేమో!

పాపం సీతారామయ్య భార్య ప్రేమను సంపాదించడానికి తనకున్న తెలివితేటలన్నీ వుపయోగించాడు. పిలక తీయించేసి క్రాఫు పెట్టించుకున్నాడు. మీసం కొద్దికొద్దిగా తగ్గించుకుంటూ వచ్చి ముక్కుకు నూటిగా నిలుపుకున్నాడు. ఇలా ఏమేమిటోచేసి లాభం పొందలేకపోగా భార్య చీవాట్లనీ, లోకుల పరిహాసాల్నీ కొనితెచ్చుకున్నాడు.

ఏమైతేనేం—సీతారామయ్య చూసి చూసి ఒక అసాధ్యమైన పని చేసి వూరుకున్నాడు.

గొప్పగొప్పవాళ్లు చేయలేని పనిని, చేయాలని వుండీకూడా దమ్ముచాలక లొట్టలు వేసే పనిని సీతారామయ్య చిటికీలో చేసివేశాడు. అంటే ఒక భోగందానివలలో పడ్డాడు, బహుశా అదే వీడి వలలో పడిందంటే బాగుంటుందేమో!

ఒకటోతేదీన యజమానిదగ్గర జీతం తీసుకుని ఆ వీధికి వెళ్ళాడు. ఓ పాతికేళ్ళపడుచు మండిగంమీద కూచుని వుంది. మనిషి యెర్రగా, బొద్దుగా అందంగా వుం. లైటువెలుతురులో తమపాకులు నమిలిన ఆమె పెదవులు ఎర్రగా కనిపించినై. వంకిలువంకిలుగా వున్న ఆ జుట్టు బలేబావుంది. ఆ చూపులు డబ్బివ్వగల ప్రతివాడూ ఇక్కడ ప్రేమింపబడతాడు అన్నట్టున్నై. సీతారామయ్యకు ఎప్పుడో ఏదో సినిమాలో చూచిన అమ్మాయి జ్ఞప్తికొచ్చింది. అప్రయత్నంగా అతని కాళ్లు ముందుకు వెళ్ళమని మారాం చేసినై.

ఆవిడ లేచి నిలబడి బిగువుగా పొంగివున్న రొమ్ములునుంచి జారే పైటను వయ్యారంగా సవరించుకుంటూ లోపలికి వెళ్ళి 'రండి' అని ఆహ్వానించింది.

సీతారామయ్యకు ఎగిరి గంతువేయా లనిపించింది. ఒక అందమైన ఆడది తనని రమ్మని ఆప్యాయంగా పిలుస్తోంది. వేశ్యకూడా డబ్బుకోసం తన అనాకారితనాన్ని ప్రేమించలేదనే అతని నమ్మకం!

లోపలికి వెళ్ళి జేబులో చెయ్యిపెట్టి వున్న నాల్గు పదిరూపాయిల కాగితాల్ని ఆవిడ చేతికిచ్చాడు. ఆ సమయాన అతనిదగ్గర లేకపోయి నైగాని వుంటే నాల్గుపదులేకాదు నలభై పదులైనా యిచ్చివుండేవాడు. అతనికికావలసిందల్లా! ఒక స్త్రీచేత ఒక్కసారైనా ప్రేమించబడ్డాననే తృప్తి. అది తలుచుకుంటూ జీవితాన్ని సుఖంగా నెట్టుకుపోగలడు!

నోట్లు లెక్కపెట్టుకుని ఆవిడ అతని వంక తమాషాగా చూసింది. తను యీ వృత్తి స్వీకరించాక ఎవ్వరూ యింతమొత్తాన్ని యింత నిర్లక్ష్యంగా యివ్వలేదు. వచ్చిన ప్రతివాడూ బేరమాడి తన వెల నిర్ణయించటమే.

ఆ చూపులు సీతారామయ్య తట్టుకోలేకపోయాడు. తన వికృతాన్ని ఆవిడ పరీక్షిస్తోందనిపించింది. అప్రయత్నంగా అతని నోటినుండి యీ మాటలు దొర్లినై.

"నాకు తెలుసు. నీవు నన్ను ప్రేమించలేవు. చేసుకున్నదే నన్ను ప్రేమించలేక పోయింది. ఇక నువ్వా—యింత అందమైనదానివి... నా డబ్బు నా కివ్వు నేను పోతాను" అంటూ చేయి జాపాడు.

ఆవిడ ఒక్క చిరునవ్వు నవ్వి, చేతుల్తో అతణ్ణి పెనవేసింది.

తెల్లవారాక సీయరామయ్య లేచి వెళ్తోంటే ఆవిడ పైకం తిర్గియిస్తూ "రాత్రికి రండి" అంది.

యీ విపరీతం వాడికి అర్థంకాక నివ్వెరపోయి, చెయ్యి అడ్డుపెట్టి 'నా కెందుకు! నా కెందుకు!!' అంటూ పోబోయాడు... వాటిని వాడి జేబులోకి తోసేసి "వస్తారు గదూ?" అంది. ఏమి చెప్పాలో వాడికి తెలియకుండానే 'సరే, సరే' అంటూ సాగిపోయాడు.

ప్రపంచంలో ఏ స్త్రీ చేతనూ ఆకర్షింపబడనటువంటి సీతారామయ్య ఒక వేశ్యాగృహంలో స్థానం సంపాదించటం విచిత్రంగానే వుంది. బహుశా ఆవిణ్ణి ఆకర్షించింది అతని అమాకత్వమై యుండాలి. యింత వరకు తన దగ్గరకు వచ్చినవాళ్ళెవ్వరూ, వాడిలా దుమ్ము కొట్టి మాసిన చినిగిన బట్టలతో రాలేదు.

కొద్దిరోజుల్లో సీతారామయ్యగుట్టు బట్టబయలయింది. మొదట యీ విషయం ఎవరూ నమ్మలేదు. సీతారామయ్యను ఒక వేశ్య ప్రేమించటం అసంభవం—అది దొమ్మరిసాని అయివుండాలన్నారు. అది వేశ్యే గనక అయితే వాడు సీతారామయ్యకాదు 'శ్రీనివాసం' అయివుండాలన్నారు. మొత్తానికి కొద్దిరోజుల్లో వాళ్లు నిజం గుర్తించక తప్పలేదు—

విచిత్రమేమిటంటే—తన భర్తకోసం ఇంకో ఆడది ప్రాణాలు విడుస్తోంది అని తెలిసిన సీతారామయ్య భార్యకి వాడిమీద ఆకస్మికంగా ప్రేమ పుట్టుకొచ్చింది.

వాడు తీరుబాటుగా కూర్చున్నప్పుడల్లా, దగ్గరకు వెళ్ళి కబుర్లుచెప్తూ, నవ్వించాలని ప్రయత్నిస్తూ, కళ్ళల్లో చూస్తూ, తల నిమురుతూ, చెంపలు తాకుతూ, ఏమేమిటో చేసేది. వాడికిదంతా చీమలుపాకినట్లై లేచిపోయేవాడు.

చివరికి ఆవిడ బెదరింపుల్లోకి దిగింది.

"ఇలా అయితే నే నీ యింట్లో ఒక్క క్షణం వుండనంది" "పో. పొమ్మ'న్నాడు. "ఏ నూతిలోనో పడి చస్తా"నంది. "శని వీరగడై పోతుంది" అన్నాడు.

తన మగ'డిలా అంటాడని వూహించను కూడా లేని సీతారామయ్య భార్య విధిలేక మామూలుగా వూరుకుంది.

ఇప్పుడు సీతారామయ్య తన అదృష్టాన్ని చాటుతూన్నట్టు రొమ్ము విరిచి నడుస్తోంటే—ఎరిగివున్న మగవాళ్లు వింతగా చూస్తారు. ఆడవాళ్లు సందులంట కళ్ళప్పగిస్తారు:—